త్యాగానికి ప్రతీక బక్రీద్
● భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు
8లో..

8లో..
కార్మిక సంఘ నాయకులతో బొగ్గు పెన్షన్‌దారుల భేటి

చినుకు రాలదు.. సాగు సాగదు..



- సాధారణం కంటే 53 శాతం తగ్గిన వర్షాలు
- ఎస్సారెస్పీ, ఎల్లంపల్లిలో అడుగంటిన నీళ్లు
- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- వర్షాలు లేక రైతుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

నైరుతి రుతు పవనాలు ఈసారి కేరళ తీరానికి ముందే వచ్చాయి. రాష్ట్రంలోనూ ముందస్తుగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు సంబరపడ్డారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమై పదిహేడు రోజులు కావస్తున్నా, చినుకు రాలక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్‌లో, శ్రీపాద ఎల్లంపల్లిలో నీళ్ల అడుగంటాయి. చెరువులు, కుంటలు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. సీజన్ ప్రారంభంలో అక్కడక్కడా కొన్ని చినుకులు రాలడంతో రైతులు దుక్కులు దున్నుకుని ఆరుతడి పంటల విత్తనాలు వేశారు. విత్తనాలు మొలకెత్తేందుకు వర్షాలు పడకపోవడంతో రైతులు పొలాల వద్దకు నీళ్ల తీసుకువెళ్లి పోస్తున్నారు. గడిచిన 17 రోజుల్లో జిల్లా సాధారణ వర్షపాతం 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 39.6 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే పడింది. 53 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యింది. సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలాల్లో సాధారణ వర్షాలు కురిశాయి. అంతర్గాంలో 46 శాతం, ఎలిగేడు 30 శాతం వర్షం తక్కువగా, ధర్మారంలో 85 శాతం, పాలకుర్తి 92 శాతం, రామగుండంలో 62 శాతం, రామగిరిలో 72 శాతం, కమాన్‌పూర్‌లో 91 శాతం, పెద్దపల్లిలో 61 శాతం, జూలపల్లిలో 66 శాతం, మంథనిలో 84 శాతం అతి తక్కువ వర్షపాతం నమోదయ్యింది. వేసవిని తలపించే విధంగా రోహిణి కార్తెలో ఎండుల దంచి కొట్టాయి. మృగశిర కార్తె ప్రారంభమై తొమ్మిది రోజులు గడుస్తున్నా కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. ప్రతి ఏటా ఈ సమయంలో సాధారణానికి మించి వర్షాలు పడితే రైతులు విత్తనాలు విత్తుకునే వాళ్లు. జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు 2,77,743 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 2,77,003 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇప్పటి వరకు ఎనిమిది వేల ఎకరాల్లో పత్తి, 120 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు కోసం విత్తనాలు వేశారు. వ్యవసాయ బావుల కింద 45 వేల ఎకరాలకు వరినార్లు పోశారు. పత్తి సాగు చేసే రైతులు మే నెల నుంచే వేసవి దుక్కులు దున్ని భూమిని చదును చేసుకున్నారు. వర్షాలు కురిసిన వెంటనే మరొకసారి దుక్కిదున్ని అచ్చు కొట్టి విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. వర్షాలు ఎప్పుడు పడతాయా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

● వర్షాలు ఆలస్యంగా కురిస్తే..

గత ఏడాది జిల్లాలో సాధారణ వర్షపాతం 1055.5 మిల్లీ మీటర్లకు గాను 1232.30 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. గత ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం 161.8 మిల్లీ మీటర్లకు గాను 186.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జూలైలో 292.4 మిల్లీ మీటర్లకు గాను 635.7 మిల్లీమీట ర్ల వర్షం కురిసింది. ఆగస్టులో 244.1కు గాను 135.6 మిల్లీమీటర్లు, సెప్టెంబరులో 177.5 మిల్లీ మీటర్లకు గాను 251.9 మిల్లీ మీటర్ల వర్షం పడింది. సాధారణానికి మించి అధికంగా వర్షాలు పడడంతో రైతులు రెండు సీజన్లలో పూర్తి స్థాయిలో పంటలను సాగు చేశారు. ఈ సీజన్‌లో వరితో పాటు పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేయాలని రైతులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు వర్షాలు పడక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి సాగు చేసే రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. తొలకరి జల్లులు కురిసిన వెంటనే అచ్చు కొట్టి విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గత ఏడాది ఈ సమయానికి సాధారణానికి మించి వర్షాలు పడడంతో 60 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఆరుతడి పంటలను వేశారు. ఈసారి వర్షాలు కురియక పోవడంతో పలు చెరువులు, కుంటలు నీళ్ల లేక వెలవెల బోతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజీలో నీళ్ల ఉండగా, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 7.826 టీఎంసీల నీళ్ల మాత్రమే ఉన్నాయి. ప్రతి ఏటా జూన్ మాసం నుంచే వర్షాలు ప్రారంభమవుతాయి. జూలై, ఆగస్టు నెలల్లో అత్యధికంగా కురుస్తాయి. జూన్‌లో కనీసం సాధారణ వర్షపాతమైనా నమోదైతే చాలు రైతులు పంటలను వేస్తారు. భారీ వర్షాలు కురిసే నాటికి పెరిగిన పంటలు దెబ్బతినకుండా ఉంటాయి. వర్షాలు ఆలస్యంగా కురిస్తే మాత్రం పంట దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నైరుతి రుతు పవనాలు బలంగా వీయడం లేదని, అవి మెత్తబడ్డాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా సాధారణానికి మించి వర్షపాతం నమోదు అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. త్వరగా వర్షాలు పడాలని రైతులు వరుణ దేవుడికి మొక్కుతున్నారు.

విద్యుత్ శాఖలో ప్రజావాణి ప్రారంభం

- ఎస్ఈ కార్యాలయంలో 16 దరఖాస్తులు



ఎస్ఈ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

పెద్దపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ద్వారా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గాను ఎన్‌పీడీసీఎల్ ఎండీ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఆరంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏఈ సెక్షన్ కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాల్లో ఎక్కడికక్కడే ప్రజావాణి నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. పెద్దపల్లిలోని ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు ఎస్ఈ బొంకూరి సుదర్శన్ దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 16 మంది వినియోగదారులు వివిధ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏడీఈ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 17: మండల కేంద్రంలోని హనుమాన్, భక్త మార్కండేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం వేడుకలు పద్మశాలి కులస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త మార్కండేయ ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహారాధన, రుద్రహోమం, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. సాయంత్రం ఉత్సవమూర్తులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు .ఈ పూజ వేడుకల్లో పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు పలువురుని కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, గ్రామ శాఖ అధ్యక్షుడు గోలి సుధాకర్, మాజీ సర్పంచ్ ఆడేపు శ్రీదేవిరాజు, కూనారం సింగిల్ విండో చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, కమిటీ సభ్యులు ఓడ్నాల శ్రీనివాస్, గోలి రమణయ్య, చేరాల శంకరయ్య, ఆడేపు శ్రీనివాస్, ఒడ్నాల రాజయ్య, ఒడ్నాల రమేష్, రమణ, వేద పండితులు దత్తు, మహేష్, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి మాత జయంతి వేడుకలు



గాయత్రి జపాన్ని పఠిస్తున్న బ్రాహ్మణులు

మంథని, జూన్ 17: గాయత్రిమాత జయంతి సందర్భంగా పట్టణంలోని బ్రాహ్మణులు సామూహికంగా గాయత్రి మాత మంత్ర జపంతో వైభవంగా సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శిలేశ్వర-సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలో వేద పండితు లు, బ్రాహ్మణులు సామూహికంగా గాయత్రీ మాత మంత్ర జపాన్ని పఠించారు. సహస్ర జప కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రోజున జ్యేష్ట శుద్ధ నిర్జల ఏకాదశి రోజుననే గాయత్రీ మాత జయంతి పర్వదినం రావడం ఎంతో శుభ సూచకమని, సర్వేజనా సుఖినోభవంతు అని గాయత్రి మాతను ప్రార్థిస్తూ లోక కల్యాణార్థం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణులు, వేద పండితులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలి

- పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ

సుల్తానాబాద్, జూన్ 17: సుల్తానాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల రైస్ మిల్లర్లు ఇటుక బట్టీల యజమానులు తమ వద్ద పని చేస్తున్న కార్మిక కుటుంబాల రక్షణ, భద్రత చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు. సుల్తానాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రైస్ మిల్లర్లు, ఇటుక బట్టీల యజమానులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడారు. మిల్లర్లు ముందుగా కార్మికులను పనిలోకి తీసుకునే ముందు వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. వారికి సంబంధించిన ఆధార్ కార్డులను సేకరించాలని, వారికి ఏమైనా నేర చరిత్ర ఉందో లేదో తెలుసుకోవాలని సూచించారు. లేబర్ రూములను మహిళలకు పురుషులకు వేరువేరుగా నిర్వహించాలని, కుటుంబ సభ్యులందరికీ వేరుగా నివాస ప్రాంతాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రైస్ మిల్లుల ముఖ ద్వారం నుంచి ఆవరణ మొత్తం వెనకాముందు కవర్ అయ్యే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇటుక బట్టీల ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మైనర్లతో పనులు చేయించవద్దని, మహిళలు, చిన్న పిల్లల కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటుక బట్టీల్లో, రైస్‌మిల్లుల్లో కార్మికులకు సంబంధించి రిజిష్టర్‌ను నిర్వహించాలన్నారు. తమ వద్ద పనిచేస్తున్న కార్మికుల గురించి వారి ప్రవర్తనను గురించి ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వారు మద్యం తాగుతూ ఏమైనా గొడవ పడుతున్నారా, గంజాయి డ్రగ్స్‌కు బానిసలుగా ఉన్నారా గమనించాలని, అలాంటి వారిని పనులలో పెట్టుకోవద్దని ఏఎస్పీ సూచించారు. ముఖ్యంగా కార్మికులకు వారి కుటుంబాలకు కనీస అవసరాలైన తాగునీరు, సరైన వసతి, కనీస ఏర్పాట్లు చేయాలని వివరించారు. సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, మిల్లర్ల సంఘ నేతలు కేశవరావు, పల్లా మురళి, నగునూరి అశోక్, తిరుపతిరెడ్డి, పురుషోత్తంరావు, ప్రకాశ్‌రావు, విజయపాల్‌రెడ్డి, పన్నాల రాములు, పల్లా వాసు, చకిలం మారుతి, కరుణాకర్, సంతోష్, ప్రసాద్, సతీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై అక్షరాయుధాలు సంధించిన 'రావికంటి'

- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ

మంథని, జూన్ 17: ప్రజాసమస్యలపై అక్షరాయుధాలు సంధించిన ప్రజాకవి, మంత్రకూట వేమనగా రావికంటి రామయ్య గుప్తా కీర్తి గడించారని, ఉపాధ్యాయుడుగా, కవిగా ఎనలేని సేవలందించారని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి కొనియాడారు. రామయ్య గుప్తా 88వ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో గల రామయ్య గుప్తా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కవితలు అల్లే వారని గుర్తు చేశారు. మంథని ప్రాంతం గర్వించదగ్గ ముద్దుబిడ్డ అన్నారు. గతంలో మంథని ప్రాంతాన్ని వరదలు ముంచెత్తినప్పుడు వరద గోదావరి పేరిట బతుకమ్మ పాటలు రాశారన్నారు. ప్రజా సమస్యలపై అనునిత్యం అక్షర పోరాటం చేశారన్నారు. వారిసేవలను నిరంతరం గుర్తు చేసుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వారి కీర్తి ప్రతిష్టలను దశదిశలా వ్యాప్తి చేయడానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు నేతలు కాచే శశిభూషణ్, బత్తుల సత్యనారాయణ, బోగోజు శ్రీనివాస్, వైశ్య సంఘం నేతలు కొమురవెల్లి శ్రీనివాస్, కిశోర్, కొంతం వివేక్ , రేపాల రమేశ్ , ఉపాధ్యాయుడు బిరుదు మధులు పాల్గొన్నారు.

● మంథని విద్యార్థి, యువత ఆధ్వర్యంలో..

అనంతరం మంథని విద్యార్థి యువత కార్యాలయం కొండేల మారుతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యెలిశెట్టి రాధాకృష్ణయ్య, రేపాల సత్యనారాయణ, మేడగోని రాజమౌళి గౌడ్, రాముడుగు మారుతి, కొమురవెల్లి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. రావికంటి రామయ్య గుప్తా వ్యక్తిత్వం, కవిత్వాల ప్రత్యేకతలను వివరించారు. వారితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రావికంటి రామయ్య తనయుడు, సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్ వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కళ్యాణ్‌నగర్, జూన్ 17: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో జరిగిన చిన్నారి హత్య ఘటనపై నిందితుడిని బహిరంగంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ నాయకురాలు మణెక్క, తిరుమల సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైస్ మిల్లుల్లో, ఇటుక బట్టీల్లో ఏడాదికి ఒక సంఘటన జరుగుతుందని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లనే నేరస్థులకు భయం లేకుండా పోతుందని వారు ఆరోపించారు. మద్యం మత్తులో, గంజాయి మత్తులో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి శిక్ష విధించాలని, బాలిక కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దపల్లి రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్ మిల్ వద్ద హత్యాచారానికి గురైన బాలికకు సోమవారం మండలంలోని సబ్బితం గ్రామ ప్రజలు కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బాలిక ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. చిన్నారని అత్యాచారం చేసిన హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుంచు సదయ్య, బీజేపీ బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దాల సతీష్ గౌడ్, నాయకులు గుర్రాల సురేష్, ఉప్పరి రవి, పులిపాక సదానందం, గుర్రాల హరీష్, గుర్రాల శంకర్, చుంచు సతీష్, చుంచు చంద్రమౌళి, పెరుక సతీష్, చిట్టవేన సంజీవ్, శిలుముల ప్రశాంత్, ఆకుల అజయ్, ఉప్పరి వంశీ, తోట శివ, గుమ్మడి సాయి, సూర్నపల్లి రాకేష్, యాదగిరి సాయి పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ బోనాలతో మహిళలు

కమాన్‌పూర్, జూన్ 17 : మండలంలోని జూలపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ముదిరాజ్ కులస్థులు పోచమ్మ తల్లికి బోనాలతో మొక్కులు చెల్లించారు. జూలపల్లిలోని మల్లికార్జున నగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు ఇంటింటి నుంచి బోనాలతో మహిళలు డీజే సౌండ్స్, డప్పుచప్పుళ్ల మధ్య పోచమ్మ తల్లి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు



తుర్కలమద్దికుంట ఉర్దూ పాఠశాల ఆవరణలో ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయని నీటి సంపు

పెద్దపల్లి రూరల్, జూన్ 17: పాఠశాలలు ప్రారంభమవుతుండటంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉద్దేశంతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా పనులు చేపడుతున్నారు. అయితే పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభం అయిన దృష్ట్యా పాఠశాలకు వచ్చే విద్యార్థులకు భద్రత లేని పరిస్థితి నెలకొంది. ప్రతి పాఠశాలకు తాగునీరు అందించేందుకు గాను నీటి సంపు నిర్మిస్తున్నారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్‌లు సంపు నిర్మాణం చేపట్టడంలో ఆలస్యం చేస్తుండటంతో పాటు దానికి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని తుర్కలమద్దికుంట లోని ఉర్దూపాఠశాలకు నిర్మించిన నీటిసంపు కు ఎలాంటి భద్రత ఏర్పాటు చేయడం లేదని, పాఠశాలలు ప్రారంభం అయినా దృష్ట్యా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. పనులు సైతం అధికారుల పర్యవేక్షణ లేకపోగా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనుల్లో నాణ్యత పాటించే విధంగా చర్యలు చేపట్టి, విద్యార్థులకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

పెద్దపల్లి రూరల్, జూన్ 17: మండలంలోని తుర్కలమద్దికుంట ప్రభుత్వ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో మద్యం ప్రియులు బయట మద్యం సీసాలు కొనుగోలు చేసి ప్రభుత్వ పాఠశాల వరండాలో తాగి వెళ్లారు. సెలవు కావడంతో పాటు పాఠశాలలకు స్కావెంజర్‌లు లేకపోవడంతో మద్యం ప్రియులకు పాఠశాలలు అడ్డాలుగా మారాయి. విద్యాశాఖ అధికారులు దృష్టిసారించి పాఠశాలల్లో ఇలాంటి తతాంగాలు జరగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తుర్కలమద్దికుంట ప్రాథమిక పాఠశాల వరండాలో మద్యం బాటిళ్లు


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి ఆలయం

ధర్మపురి, జూన్ 17: ధర్మపురి లక్ష్మీనరసింహుడి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ట శుద్ధ ఏకాదశి తోడుగా సెలవు దినం కావటం వల్ల ఉదయం వరకు క్షేత్ర నలుమూలల నుంచి భక్తులు చేరుకున్నారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం స్వామి వారి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేసి అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం చేయించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి జలంతో అభిషేకం జరిపి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 17: హోంగార్డు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. జమ్మికుంట మండలం కోరపల్లి శివారులో ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ ఆపి పేపర్లు పరిశీలించారు. అవి సరిగా లేక పోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించాలని హోంగార్డు రవీందర్‌ను ఆదేశించారు. టాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా, మార్గ మధ్యలో శ్రీదేవి రైస్ మిల్లు వద్ద ట్రాక్టర్ యాజమాని అడ్డుకొని హోంగార్డును కిందకు దించి ట్రాక్టర్‌ను తీసుకు వెళ్లాడు. విధులకు ఆటంకం కలిగించిన సంఘటనలో డ్రైవర్ అనిల్‌కుమార్, యాజమాని నాగరాజు, బండ అరవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పిల్లలను కాపాడబోయి.. నీటిలో మునిగి తండ్రి మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మృతుడు విజయ్‌కుమార్ (ఇన్‌సెట్లో)

ఇద్దరు పిల్లలను కాపాడిన జాలర్లు

తిమ్మాపూర్, జూన్ 17: నీటిలో మునిగిపోతున్న పిల్లలను కాపాడబోయి ఓ తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ (వర్క్ అండ్ ప్రాజెక్టు) డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బంగారి విజయ్ కుమార్ (47) తన కుటుంబంతో కలిసి కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నాడు. విజయ్ కుమార్ భార్య ప్రశాంతి, కూతురు సాయినిత్య, కుమారుడు విక్రాంత్, అత్త పుష్పలతతో కలిసి సోమవారం ఉదయం హుస్నాబాద్‌లోని పొట్లపల్లి శివాలయానికి వెళ్లారు.

దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో దిగువ మానేరు జలాశయం వద్దకు వెళ్లారు. కాకతీయ మెయిన్ కెనాల్ దిగువకు నీటిని విడుదల చేసే రెగ్యులేటరీ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో రెగ్యులేటరీ సమీపంలో ఉన్న స్టాండింగ్ పాయింట్ వద్దకు వెళ్లిన సాయినిత్య ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయింది. సాయినిత్యను కాపాడేందుకు విజయ్‌కుమార్ నీటిలో దూకాడు. వీళ్లను చూసిన కుమారుడు విక్రాంత్ కూడా నీళ్లలోకి దూకాడు. అతడూ మునిగి పోవడం ప్రారంభించాడు. వారిద్దరిని విజయ్‌కుమార్ గట్టువైపునకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు. గట్టున ఉన్న విజయ్‌కుమార్ భార్య ప్రశాంతి కాపాడండి అంటూ కేకలు వేసింది. అక్కడికి సమీపంలో ఉన్న శంకర్ అనే జాలరి గమనించి వెంటనే వారి వద్దకు వెళ్లి పిల్లలను బయటకు తీసుకువచ్చాడు. అప్పటికే అలిసిపోయిన విజయ్‌కుమార్ నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. విజయ్ కుమార్ భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు. ఎల్‌ఎండీలో మునిగి విజయ్‌కుమార్ మృతి చెందిన సంఘటన తెలిసిన వెంటనే మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లలను కాపాడిని శంకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పిల్లలను కాపాడిన జాలరి శంకర్

పాడి రైతుకు దిగాలు!

- రోజు రోజుకీ తగ్గుతున్న ఆవు పాల ధరలు
- ఇన్సెంటివ్, ప్రభుత్వ ప్రోత్సాహం కరువే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు, డెయిరీ నిర్వాహకులు


డెయిరీలోని ఆవులు

మల్యాల, జూన్ 17: ఆవు పాల ధరలు రోజురోజుకీ తగ్గడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న డెయిరీలను మరింతగా ప్రోత్సాహించాల్సింది పోయి పాల ధరలు తగ్గిస్తూ ఆవేధనకు గురి చేస్తున్నారు. క్షీర విప్లవంలో భాగంగా కొన్నాళ్ల క్రితం వరకు గ్రామాల్లో డెయిరీలను ప్రోత్సహిం చడంతో అనేక మంది ఆవులు, గేదెల ఫామ్‌లు ఏర్పాటు చేశారు. వాటి నుంచి నిత్యం పాలను సేకరిస్తూ ధరలకు అదనంగా ఇన్సెంటివ్, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పాడి రైతులకు ఇచ్చేవారు. అయితే ఇటీవల వాటిని ఎత్తివేయడమే కాకుండా ఎప్పుడూ చెల్లించే పాల ధరలను తగ్గించ డంతో తమకు డెయిరీల నిర్వహణ భారంగా మారిందని దిగాలు చెందుతున్నారు. ఆవులు, గేదేలకు అందించే దాణ ఇత రాత్రా ఖర్చు లు పెరుగుతుండడానికి అనుగుణంగా పాల ధరలను కూడా క్రమేపీ పెంచాల్సింది పోయి తగ్గించడం సరికాదని ఇలాగైతే తాము డెయి రీలను మూసుకోవడమే శరణ్యమని అంటున్నారు.

● ఎనిమిది నెలల్లో రూ.7 తగ్గింపు

లీటర్ ఆవు పాలకు గత సెప్టెంబర్, అక్టోబర్ నెలలో కరీంనగర్ డెయిరీ వాళ్లు రూ.43చెల్లించగా ప్రస్తుతం రూ.35.65మాత్రమే ఇస్తు న్నారని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పాడి రైతులు తెలిపారు. లీటర్‌కు దాదాపు రూ.7కు పైగా తగ్గిందని ఇలాగైతే నిర్వహణ ఎలా అంటూ ఆవేదన చెందుతున్నారు. 50లీటర్లు ఆపై పాలు సేకరిస్తే లీటర్‌కు రూ.35.65తో పాటు రూ.1, 100లీటర్లకు రూ.2 ఇలా పాలు పెరిగిన కొలది ఇన్సెంటివ్ పెంచుతూ వాటిని అందిం చేవారు. అయితే ఇటీవల అందించడం లేదని పైగా పాల ధరలను కూడా గణనీయంగా తగ్గిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. మల్యాల మండలం తాటిపల్లితో పాటు పలు గ్రామాల్లో, రాయికల్, జగిత్యాల తదితర మండలాలల్లో డెయిరీలు ఉండగా కొన్ని చోట్ల కరీంనగర్ డెయిరీ వాళ్లు వందలాది లీటర్ల పాలు సేకరణ చేస్తున్నా రు. అయితే ఇటీవల ధరలు తగ్గించడంతో నిర్వహణ భారంగా మా రుతుందని లీటర్‌కు రూ.7వరకు తగ్గుదలతో అప్పులతో డెయిరీలను మూసివేయడమే శరణ్యమని అంటుండగా కొన్నాళ్ల క్రితం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ధరల పెంపునకు కృషి చేయాలని కోరారు.

అలాగే ప్రభుత్వం లీటర్ పాలకు చెల్లించే రూ.4 ప్రోత్సాహం కొన్నేళ్లగా రావడం లేదని పాడి రైతులు అంటున్నారు. ఇటీవల వెన్న శాతం తక్కువ వచ్చే వారికి కోతలు గతంలో కన్నా రెట్టింపు చేయడం మరింత ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొంటున్నారు. మరింత ప్రోత్సాహించాల్సింది పోయి మూసివేసుకునే రీతిలో వ్యవహరిస్తున్నరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవు పాల దిగుమతులు పెరుగడంతోనే ధరలు తగ్గిస్నట్లు తెలుస్తుంది. కరీంనగర్ డెయిరీ సూపర్ వైజర్ మహిపాల్ రెడ్డిని సంప్రదించగా ధరల పెంపు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ తామని తెలిపారు.

ధర తగ్గింపుతో నష్టం..: తూకుంట్ల రవీందర్‌రెడ్డి, తాటిపల్లి



పాల ధరలను తరచూ తగ్గించడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. దాణా, నిర్వహణ ఖర్చులు పెరు గుతున్న నేపథ్యంలో పాల ధరలను కూడా పెంచాల్సి ఉండగా పెంచకపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తోంది. ధరల తగ్గింపుతో నా ఒక్కనికే దాదాపుగా రూ.30వేల వరకు నష్టపోవాల్సి వస్తుందంటే మిగితా వాళ్లు ఎంత నష్టపోతున్నారో తెలుస్తుంది. ధరలను పంచడమే కాకుండా ఇన్సెంటివ్, ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

మృతదేహం కోసం తండ్రి, భార్య వర్గాల మధ్య గొడవ


గొడవలో తలకు గాయంతో మృతుడి భార్య స్వాతి

కరీంనగర్ క్రైం, జూన్ 17: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా కరీంనగర్ శివారులోని చంద్రాపూర్‌కాలనీలో వల్లపు స్వామి(36) ఆది వారం రాత్రి 11 గంటలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి మృతదేహానికి సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కరీంనగర్ రూరల్ పోలీసులు పంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. కాగా మృతదేహాన్ని తామే తీసుకువెళతామని మృతుడి భార్య, కాదు తామే తీసుకువెళతామని మృతుడి తండ్రి వర్గాలకు చెందినవారు గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకోగా మృతుడి భార్య స్వాతితోపాటు ఇరు వర్గాలకు చెందిన మరి కొందరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరు వర్గాలను చెరగొట్టి అక్కడి నుంచి పంపించివేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన వల్లపు స్వామి, తన భార్య స్వాతి, ఇద్దరు పిల్లలతో కలిసి ఆరు నెలల కిందట కరీంనగర్‌కు వచ్చి చంద్రాపూర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే తరచుగా స్వామి, స్వాతి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న స్వామిభార్య పుట్టింటికి(కొత్తగూడెం) వెళ్లి పిల్లల సర్టిఫికెట్లు తీసుకుని ఆదివారం కరీంనగర్‌కు వచ్చింది. అయితే అక్కడ ఉన్న కోళ్లు, బియ్యం ఎందుకు తీసుకు రాలేదని స్వామి రాత్రి 9 గంటలకు తన భార్యతో గొడవపడి ఆమెను కొట్టాడు. దీంతో అతని భార్య సమీపంలోని బంధువుల ఇంటిలో పిల్లలతో కలిసి నిద్రిచింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న స్వామి రాత్రి 11 గంటలకు తన బంధువులకు వీడియోకాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలో ఉన్న బంధువులు వచ్చి చూసేసరికి స్వామి ఉరికి వేళాడుతూ కనిపించాడు. ఈ విషయం మృతుడి భార్య బంధువు లకు తెలిపింది. సోమవారం ఉదయం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం మృతదేహం తీసుకువెళ్లే విషయంలో ఇరువర్గాలు గొడవపడ్డారు.

స్వామికి దామెరలో ఇళ్లులేదని, అక్కడ కార్యక్రమాలు నిర్వహించటం కష్టమవుతుందని మృతుడి భార్య స్వాతి, ఆమె సోదరులు వాదిస్తూ స్వామి మృతదేహాన్ని వరంగల్ జిల్లా నర్సంపేట వద్ద కొత్తగూడకు తీసుకువెళతామని పట్టుబట్టారు. అయితే తన కొడుకు మృతదేహాన్ని తన గ్రామం దామెరకే తీసుకువెళతామని తండ్రి జంపయ్య, మృతుని సోదరులు పట్టుబట్టారు. ఈ గొడవలో ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకున్నారు. అక్కడే ఉన్న ఒక అంబులెన్స్ అద్దాలు కూడా రాళ్ల దెబ్బకు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి మృతుడి తండ్రి జంపయ్యకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 17: ఒంటిపై వేడినీళ్లు పడి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామగిరి యాదగిరి (64) ఆదివారం మృతిచెందాడని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. సప్తగిరి కాలనీకి చెందిన యాదగిరి ఈ నెల 7న ఉదయం స్నానం కోసం వేడినీళ్లు తీసుకెళ్తూ జారి కిందపడగా వేడి నీళ్లు అతని ముఖం, ఇతర చోట్ల పడి గాయాలయ్యాయి. అతన్ని కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చిప్పలపెల్లిలో రెండిళ్లలో చోరీ

ముస్తాబాద్, జూన్ 17: మండలంలోని చిప్పలపెల్లి గ్రామంలోని రెండిళ్లలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిచర్ల నర్సవ్వకు చెందిన ఇంట్లో రూ. 1.85 లక్షలు, తులం వెండి, గాడిచర్ల నరేశ్ ఇంట్లో బంగారు గుండ్లు, చెవుల కమ్మలు, చిన్న చెవికమ్మలు, దాదాపు రెండు తులాల వెండి పట్టగొలుసులు, రెండు జతల వెండి బ్రాస్ లెట్, చిన్న పిల్లల పట్టగొలుసులు, నడుము వెండి ఎత్తుకెళ్లారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నేత కార్మికుడి మృతి


శేఖర్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 17: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడాల శేఖర్ (55) అనే నేత కార్మికుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రం ఇందిరనగర్‌కు చెందిన నేత కార్మికుడు శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. పద్మనగర్ శివారులో ప్రమాదవ శాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు

మానకొండూర్, జూన్ 17: మండలంలోని ఈదులగట్టెపల్లి-ఖాదర్‌గూడెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న టీఎస్ 09 జెడ్ 8112 ఆర్టీసీ బస్సును వరంగల్ నుంచి ఎదురుగా వస్తున్న టీఎస్ 02 ఈహెచ్ 5683 నుంబరు గల కారు ఢీకొంది. కారు వెనకాల వస్తున్న బైక్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శివకుమార్, అతని భార్య నీతీష, బైక్‌పై వస్తున్న లక్ష్మణ్ గాయపడ్డారు. క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గల్ఫ్ నకిలీ ఏజెంట్ ఇంటి ఎదుట బాధితుల నిరసన


గల్ఫ్ ఏజెంట్ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

కోనరావుపేట, జూన్ 17: విదేశాలకు పంపిస్తానని పలువురిని మోసం చేసి గల్ఫ్ నకిలీ ఏజెంట్ ఇంటి ఎదుట బాధితులు సోమవారం నిరసనకు దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన గల్ఫ్ నకిలీ ఏజెంట్ చెలిమెల అలియాస్ చందనగిరి తిరుపతి విదేశాలకు పంపిస్తానని పలువురి వద్ద 10 లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఏడాదిన్నర గడిచినా పంపించక పోవడంతో బాధితులు కుటుంబసభ్యులతో సహా ఏజెంట్ ఇంటి వద్దకు చేరుకున్నారు. ధర్మారం గ్రామానికి చెందిన వెంగలి దేవయ్య, తాళ్లపల్లి రాజు, వెంగలి నవీన్, ఊరడి రాములు, కొలనూరుకు చెంది న బత్తిని రమేష్, నిజామాబాద్‌కు చెందిన ఊరడి మధు, పిట్టల రవిని యూరప్ పంపిస్తానని 10 లక్షల రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. తమకు చెప్పకుండా దుబాయ్ వెళ్లిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించడానికి తిరుపతి గడువు కోరడంతో బాధితులు శాంతించారు.

ఆటో, బైక్ ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, జూన్ 17 : మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో సోమవారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరుపల్లి నుంచి మన్నెంపల్లి వైపు వెళుతున్న ఆటో, ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన దొంత బాబు, మంద శ్రీనివాస్ తీవ్రగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి తగదాలో మూకుమ్మడి దాడి

ఒకరి మృతి

ఎనిమిది మందిపై కేసు నమోదు

కోరుట్ల రూరల్, జూన్ 17 : కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న ఆస్తి తగాదా ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. మండలంలోని మోహన్‌రావుపేటలో సోమవారం కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఒక్కరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై రాజేష్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు... బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల మండలంలో మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోట గంగరాజంకు ఇద్దరు కుమారులు కోట రాజేష్, కోట రాకేశ్ ఉన్నారు. గ్రామంలో ఉన్న ఆస్తి పంపకంపై కొన్ని రోజులుగా వీరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గంగరాజం కుటుంబ సభ్యులు సమీప బంధువులతో ఆస్తి పంపకం విషయమై మరో మారు సమావేశం అయ్యారు. పంపకాల విషయంలో ఉదయం నుంచి పలు మార్లు రాజేష్‌ను సముదా యించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో అక్కడే ఉన్న తమ్ముడు రాకేష్ కోపోద్రిక్తుడై కత్తితో రాజేష్‌పై దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో తండ్రి గంగరాజంతో పాటు బంధువులు రాజేష్‌పై దాడి చేయడంతో అప్పటికే రాజేష్ అపస్మారకస్థితికి వెళ్లాడు. దీంతో అక్కడే ఉన్న రాజేష్ భార్య లాస్య గ్రామస్థుల సహకారంతో హుటా హుటిన కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు బంధువులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో రాజేష్ మృతి చెందాడు.


రాజేష్ (ఫైల్)

గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో పరిశీలన జరిపారు. రాజేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజేష్ హత్య కేసులో ఎనిమిది మందిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సోదరుడు రాకేష్‌తో పాటు తండ్రి గంగరాజంతో పాటు బాబాయిలు మంచాల రాజేశం, కోట గంగారాజం, లిం గంపల్లి నరేష్ (రాకేష్ స్నేహితుడు), కోట మానస, కోట మల్లు, మంచాల లక్ష్మిలపై కేసు నమోదు చేశారు.

చెరువు మట్టి హాంఫట్ !

● అనుమతికి మించి అక్రమ తరలింపు ● పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

మల్యాల, జూన్ 17: చెరువు మట్టి అక్రమంగా తరలుతోంది. అధికారులు, నాయకుల అండదండలతో అనుమతికి మించి తరలిస్తున్నారు. ఇటుకబట్టీలకు వేలాది క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తరలుతున్నప్పటికీ ఇరిగేషన్, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే మట్టి అక్రమార్కులకు వరంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులో గల రేణికుంట చెరువు నుంచి మట్టిని గత రెండు రోజులుగా అనుమతికి మించి అక్రమంగా తరలిస్తుండడంతో గ్రామస్థులు ఆదివారం డయల్ 100కు, ఇరిగేషన్ అధికారులకు పిర్యాదు చేశారు. అయినప్పటికీ మట్టి తరలింపు కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


టిప్పరులో తరలిస్తున్న మట్టి

● అనుమతికి మించి తరలింపు..

రేణికుంట చెరువులో మట్టిని వెయ్యి క్యూబిక్ మీటర్ల వరకు తరలింపునకు కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అనుమతి ఇచ్చారు. 12మీటర్ల లోతు తవ్వకాలతో కేవలం ఆరు వాహనాలలో మాత్రమే తరలించడానికి ఇరిగేషన్ ఈఈ ఆర్డర్ ఇచ్చారు. అయితే ఆదివారం దాదాపు 30 వాహనాలలో మట్టిని తరలించారని అనుమతికి మించి మట్టిని తీస్తున్నారని గ్రామస్తులు పోలీస్‌శాఖ 100 డయల్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతులు ఉన్నాయంటూ సదరు పోలీసులు వెళ్లి పోయారని స్థానికులు తెలిపారు. వారం రోజులుగా ఇదే ప్రాంతం నుంచి మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను, అయిదు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం ఆరు వాహనాలకే అనుమతి ఉన్నప్పటికీ పదుల సంఖ్యల వాహనాల్లో తరలిస్తున్న పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని దీంతో ప్రభుత్వం సీనరేజిని కోల్పోతుండగా అక్రమార్కులకు చెరువు మట్టి కల్ప తరువుగా మారిందని పేర్కొం టున్నారు.

చర్యలు తీసుకుంటాం

: తిరుపతి, డీఈ, ఇరిగేషన్

అనుమతికి మించి తరలిస్తే తగు చర్యలు తీసుకుంటాం. ఆరు వాహనాలకే అనుమతి ఇవ్వడం జరిగింది. మట్టి తవ్వకాలు ఎక్కువగా చేస్తే క్యూబిక్ మీటర్ల వారీగా ఫీజు వసూలు చేయడం జరుగుతుంది. ఎక్కువ తవ్వకాలు చేయకుండా పరిమితికి మించి వాహనాల్లో తరలకుండా అక్కడే ఉండే తమ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

ఫోర్ లైన్‌కు మోక్షమెప్పుడో?

- ప్రమాదకరంగా కొదురుపాక -నందికమాన్ రోడ్డు
- తరచూ ప్రమాదాలతో ఆందోళన
- రోడ్డు విస్తరణ చేపట్టాలని వాహనదారుల డిమాండ్


నాంపల్లి ఘాట్ రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా రహదారి

వేములవాడ టౌన్, జూన్ 17 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తారు. ముఖ్యంగా వరంగల్, హన్మకొండతోపాటు కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు అధికంగా ఉంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తుంటాయి. కరీంనగర్ నుంచి కొదురుపాక వరకు ఫోర్‌వే లైన్ రోడ్డు పూర్తయ్యింది. సిరిసిల్ల నుంచి వేములవాడకు నాలుగు వరుసల రోడ్డు పనులు పూర్తయ్యాయి. కానీ కొదురుపాక గ్రామం నుంచి నాంపల్లి నందికమాన్ వరకు ఫోర్ వే రోడ్డు మంజూరు కాకపోవడం, రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కొదురుపాక గ్రామం నుంచి ప్రధాన రహదారిని ఆనుకొని పునరావాస కాలనీలు ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి కాలనీలు వెలిశాయి. దీంతో రోడ్డు కాస్తా రద్దీగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోర్ వే లైన్ మంజూరు చేయాలని స్థానికులు పలు మార్లు అధికారులు, ప్రజానిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఫోర్ వే లైన్ రోడ్డుకు మాత్రం మోక్షం లభించలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాలుగు వరసల రోడ్డు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆరు నెలలో ముగ్గురు మృతి..

కొదురుపాక శివారు నుంచి నాంపల్లి నందికమాన్ చౌరస్తా వరకు రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాంపల్లి ఘాటు రోడ్డు సమీపంలో ఇటీవల డీసీఎం వ్యాన్, లారీ ఢీకొన్న ప్రమాదంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన బాపురెడ్డి అనే డీసీఎం వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరెపల్లి గ్రామంలో చీర్లవంచ గ్రామానికి చెందిన దేవారాజు అనే యువకుడు, రుద్రవరం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన పర్శరాములు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గుర్తె మృత్యువాత పడ్డారు. తరచూ రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌అండ్ బీ, పోలీస్ అధికారులు బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పా టు చేసినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రోడ్డు విస్తరణ పనులు చేపట్టి నివారించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణతోనే ప్రమాదాల నివారణ

మేర్గు లక్ష్మణ్, వాహనదారుడు, నాంపల్లి



కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. రాత్రి పూట వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. రోడ్డు చిన్నగా ఉండడంతో నాంపల్లి ఘాటు రోడ్డు సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డును విస్తరిస్తే తప్పా రోడ్డు ప్రమాదాలను నివారించలేం.

ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే భయం

పండుగ శంకర్, వాహనదారుడు, సంకెపల్లి



సంకెపల్లి గ్రామం నుంచి వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంటుంది. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్డు చిన్నగా ఉంది. ఆరెపల్లి నుంచి నందికమాన్ వరకు రోడ్డుకు ఇరువైపుల గ్రామాలు ఉండడంతో రోడ్డు చుట్టూ నిత్యం ప్రజలు, వాహ నాలతో బిజీబిజీగా కనిపిస్తుంది. ఫోర్‌లైన్ రోడ్డును వీలైనంత త్వరగా చేపడితే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టు వేయవచ్చు.

ఫోర్‌వే నిర్మించాలి: కాసర్ల అరుణ్, రుద్రవరం



రుద్రవరం సమీపంలో రోడ్డుకు రెండు వైపుల ఇళ్లు ఉంటాయి. అటు వైపు వెళ్దామంటే భయంగా ఉంటుంది. రోడ్డుపైన స్పీడ్‌ను కంట్రోల్ చేసేందుకు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలి. వాహనాలు స్పీడ్‌గా వెళ్లడంతో వాటి వేగాన్ని అంచన వేయకుండా రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫోర్ వే లైన్ రోడ్డును వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలి.

నేడు కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికలు


కేశోరాం కంపెనీ

పాలకుర్తి, జూన్ 17: బసంత్‌నగర్ కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఉదయం ఐదున్నర గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై మూడన్నర గంటల వరకు కొనసాగనుంది. అనంతరం ఎన్నికల లెక్కింపు ప్రారంభం కానుంది. 809 మంది కాంట్రాక్టు కార్మికులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవులకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి బద్దం డానియల్‌కు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేశోరాం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి బలపరిచిన నగునూరి రమేష్, బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి బలపరిచిన అభ్యర్థి మాదాసు శ్రీనివాస్ మధ్యనే పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. ఎన్నికలకు కావలసిన అన్ని ఏర్పాట్లను కంపెనీ అధికారులు సిద్ధం చేశారు.

ఓడేడులో చేతిపంపునకు మరమ్మతు

ముత్తారం, జూన్ 17: మండలంలోని ఓడేడు గ్రామంలోని 5వ వార్డులో చేతిపంపు చెడిపోయి నీళ్లు రాకపోవడంతో వార్డు ప్రజల ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్ స్పందించి తన సొంత ఖర్చులతో ఆదివారం చేతిపంపునకు మరమ్మతులు చేయించి నీటి ఇబ్బందులు తీర్చారు. దీంతో ఆయనను వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఎండీ రజాక్, జిల్లెల సంపత్, రాకేష్, ఓదేలు తదితరులు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలను ఉపయోగంలోకి తీసుకురావాలి


మాట్లాడుతున్న బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్

రామగిరి, జూన్ 17: మండలం కేంద్రంలో నిర్మాణం చేపట్టిన కస్తూర్బా పాఠశాలను ఉపయోగంలోకి తీసుకురావలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలోని పన్నూరులో నిర్మాణం చేపట్టిన కస్తూర్బా పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని సెంటినరీకాలనీలో సింగరేణి కల్పించిన తాత్కాలిక భవనం సముదాయంలో మౌలిక వసతులు లేని కారణంగా అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కస్తూర్బా శాశ్వత భవనం నిర్మించి సంవత్సరం గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. దీనిపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ దృష్టి సారించాల్సిందిగా కోరారు. స్థానిక ప్రజాప్రతినిధిలు పట్టించుకోవడం లేదన్నారు. కస్తూర్బాలో సుమారు మూడు వందల మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నా శాశ్వత భవనంలోకి మార్చడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణం కస్తూర్బా పాఠశాల ప్రారంభోత్సవం చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, ధీరజ్, శివనాగరాజ్, అనిల్, కందుల రాము పాల్గొన్నారు.

పంట పొలాలకు రోడ్డు సౌకర్యం

- ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఓదెల, జూన్ 17: మండలంలోని గూడెంలో బీరన్న దేవాలయానికి , పొత్కపల్లి పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కోసం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు నిధులు మంజూరు చేయగా సోమవారం సంబంధిత రైతులు ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేంసాగర్‌రెడ్డి మాట్లాడుతూ పొలాల వద్దకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షల మేర నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ప్రేంసాగర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి నిధులు ఇవ్వడం పట్ల గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు దాసరి రాజన్న, పడాల రాజు, డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ వంగ శ్రీనివాస్ యాదవ్, ఐలయ్య, ఎంపీటీసీ తిప్పారపు శారద-సంపత్, చిట్ల రాము, కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి శిక్షణ తరగతులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 17: జూన్ 18 నుంచి 20 వరకు జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్, కరపత్రాలను సోమవారం కాలనీలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా కార్యదర్శి కే రాజారత్నం మాట్లాడుతూ యాదగిరిగుట్టలో 18,19,20 తేదీల్లో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. అనాదిగా వివక్షకు గురవుతున్న సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిందే డీహెచ్‌పీఎస్ అన్నారు. దళితులను సామాజికంగా, ఆర్థిక, రాజకీయ ఎదిగేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. దళిత సమాజాన్ని చైతన్యవంతం చేయడం, సంఘటితం చేయడం కోసం శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు రాజారత్నం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర తిరుపతి, కొంద్ర సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సాంబయ్య, లింగయ్య, సత్యనారాయణ ఉన్నారు.

యూసూఫ్‌కు సేవామిత్ర అవార్డు

కమాన్‌పూర్, జూన్ 17: మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రధాన కార్య దర్శిగా పనిచేస్తున్న మహమ్మద్ యూసూఫ్ నిరంతరం ప్రజాసేవ చేస్తున్నందుకు బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సోమవారం సేవామిత్ర అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్ బూస ప్రదీప్, ట్రెజరర్ గుమ్మడి రాజ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

మెడికల్ కళాశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కళ్యాణ్‌నగర్, జూన్ 17: సింగరేణి మెడికల్ కళాశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి కలకలం రేపింది. ఢిల్లీకి చెందిన అజాన్ అక్తర్ అనే విద్యార్థి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉంటున్న అక్తర్ గుర్తుతెలియని ట్యాబ్లెట్‌లు వేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లగా తోటి విద్యార్థులు గమనించి వెంటనే గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు
- బందోబస్తును పరిశీలించిన రామగుండం సీపీ శ్రీనివాసులు


గోదావరిఖనిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గోదావరిఖనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ శ్రీనివాసులు


కమాన్‌పూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కళ్యాణ్‌నగర్, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను రాజన్న జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గోదావరిఖనిలోని ఫోరింక్లయిన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు అలాయ్ బలాయ్ తీసుకున్నారు. త్యాగానికి, భక్తికి ప్రతీక బక్రీద్ అని అన్నారు. అనంతరం ముస్లిం కుటుంబాలు కుర్బానీనీ పంపిణీ చేశారు.

● గోదావరిఖని ఫైవింక్లయిన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును రామగుండం సీపీ శ్రీనివాసులు పరిశీలించారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకుంటున్నారని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. సీపీ వెంట ఏసీపీ రమేష్, రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా కొత్త బట్టలు ధరించి ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ ఇబ్రహీం, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ ఫకీర్, సాజిత్, తాజుద్దీన్, ఎండీ మున్నీర్, రహీం ఖాన్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలో బక్రీద్ పండుగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు గుండారం, జూలపల్లి, పేరాపల్లి తదితర గ్రామాల్లోని ముస్లింలు మండల కేంద్రంలోని ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు షోయబ్ అలం బక్రీద్ విశిష్టతను ముస్లిం సోదరులకు వివరించారు. నమాజ్ అనంతరం చిన్న, పెద్ద తేడా లేకుండా బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొని ఇళ్లలో తీపి వంటకాలు చేసుకొని పండుగ చేసుకున్నారు. వేడుకలో రఫీక్ అహ్మద్‌ఖాన్, ఇంతియాజ్ ముస్తాక్, రఫిక్, హబీబ్, షౌకత్‌ఖాన్, ముఖీద్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


మంథనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ

ఎలిగేడు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బక్రీద్ త్యాగం, భక్తి విశ్వానికి ప్రతీక మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను సోదరభావాన్ని అనుసరించాలనే విషయాన్ని బోధిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. ఎలిగేడు దర్గాలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్‌లు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తానాబాద్: బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో గల ఈద్గా వద్ద ముస్లింలు చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత గురువుతు తమ సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు పలువురు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ అలాయ్ బలాయ్ తీసుకున్నారు.

ఓదెల: మండలంలోని మజీద్, ఈద్గాలలో సోమవారం ముస్లిం బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖురాన్ ప్రవచనాలను నిర్వహిస్తూ, మహ్మద్ ప్రవక్త ఖ్యాదనీరతిని వివరించారు. అనంతరం కుల, మతాలకు అతీతంగా పొత్కపల్లి, కొలనూర్, కనగర్తి గ్రామాల్లోని మజీద్‌లో అలాయ్ బలాయ్‌తో శుభాకాంక్షలు తెలిపారు.

మంథని: పట్టణంలోని ముస్లింలు బక్రిద్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ముస్లింలు మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు శశిభూషన్‌కాచే, అయిలి ప్రసాద్, జమీల్, అజీంలు శుభాకాంక్షలు తెలియ జేశారు.

బక్రీద్ పండగ ప్రముఖ్యతను వివరించి త్యాగాన్ని కొనియాడారు. అందరూ సాటి మనుషుల త్యాగనిరతిని కలిగి ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పొత్కపల్లి ఈద్గాలో ఖురాన్ ప్రవచనాలను వివరిస్తున్న ఇమామ్


కాల్వశ్రీరాంపూర్‌లో..


సుల్తానాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా 'హర్కార' జన్మదినం

అంతర్గాం, జూన్ 17: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం రామగుండంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. తబితా ఆశ్రమంలో జన్మదిన కేక్‌కట్ చేసి చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాజిద్‌ఖాన్, పల్లికొండ శ్యామ్, ఊదరి సత్తయ్యగౌడ్, గోవర్ధన్, నరేందర్, శ్రీనివాస్, దస్తగిరి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి

మంథని, జూన్ 17: మున్సిపల్ పరిధిలోని గంగాపురి బొక్కలవాగు వద్ద మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గొర్రె రమేష్‌కు సంబంధించిన రెండు గొర్రెలు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాయి. మేతకు వెళ్లిన గొర్రెల మందలోని గొర్రెలు బొక్కలవాగులో నుంచి సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు మోటార్లు బిగించి నీటి సరఫరా చేసుకుంటున్న మిల్లర్ల నిర్లక్ష్యంతో విద్యుదాఘాతంతో తన గొర్రెలు చనిపోయాయని బాధితుడు రమేష్ ఆరోపిస్తూ తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 17: కాలనీలో బల్ల స్వామి(68) అనే వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ రవీందర్ తెలిపారు. సంతోష్‌నగర్‌కు చెందిన స్వామి కొద్దిరోజులుగా మతి స్థిమితం కోల్పోయాడు. సోమవారం మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా జాడ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. స్వామి కుమారుడు బల్ల రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు. బయటకు వెళ్లిన సమయంలో స్వామి బ్లూ కలర్ షర్టు, ముదురు గోధుమ రంగు డబ్బాల లుంగీ కట్టుకుని ఉన్నట్టు సీఐ తెలిపారు. బల్ల స్వామి ఆచూకి తెలిసిన వారు 8712656520, 8712575516 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

బక్రీద్ ఏర్పాట్లలో కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం

- జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్

కోల్‌సిటీ, జూన్ 17: బక్రిద్ ఏర్పాట్లలో కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వహించడం వల్ల కమిటీ జామా మసీద్ అధ్యక్షులు అబ్దుల్ రషీద్, ప్రధాన కార్యదర్శి తాజుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది బక్రిద్, రంజాన్ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు షామియానాలు, కార్పొరేటర్లు, సౌండ్ సిస్టం, కుర్చీలు, మంచినీటిని ఏర్పాటు చేస్తారు. కానీ ఈసారి బక్రిద్ సందర్భంగా ఎలాంటి ఏర్పాట్లు చేయకుండా చిరిగిన కార్పెట్లు, షామియానాలు ఏర్పాటు చేశారని, ప్రతి ఏటా ఈద్గాల వద్ద ప్రార్థనల కోసం రూ.15లక్షలు జనరల్ ఫండ్ ద్వారా కేటాయించేవారని, ఈ ఏడాది వాటిని రూ.9లక్షలకు కుదించి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు, నమాజ్ చదువుతున్న సమయంలో టెంట్లను వేయడం, చిరిగిపోయిన టెంట్ల వల్ల ఎండవేడికి తట్టుకోలేకపోయామని, కార్పొరేషన్ అధికారులు కనీసం మంచినీటి కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు వివక్ష చూపడం సరైంది కాదని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు.

కార్మిక సంఘ నాయకులతో బొగ్గు పెన్షన్‌దారుల భేటి

- సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న పెన్షన్‌దారులు

గోదావరిఖని, జూన్ 17: హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్‌తో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వీటిలో ముఖ్యమైన కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని, చమురు సంస్థల్లో విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చినట్లుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్డ్ మెడికేర్ స్కీం(సీపీఆర్ఎస్) ప్రస్తుతం ఎనిమిది లక్షల రూపాయలు ప్రస్తుత వైద్య సేవలకు సరిపోవడంలేదని ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెడికల్ పరిమితి పెంచి ఆదుకోవాలన్నారు. హైదరాబాద్‌లో నెలవారీ మందులు ఇచ్చే ఏర్పాటు చేయాలని, రెండు నెలల క్రితం జరిగిన సీపీఆర్ఎస్ ట్రస్టు బోర్డు సమావేశంలో జరిగిన నిర్ణయాలను అమలు పరచాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కోల్‌మైన్స్ పెన్షన్ చట్టం సవరించి బొగ్గు పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా కేంద్రప్రభుత్వం లేఖ రాసి, అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని రావాలన్నారు. అతి తక్కువ సీఎంపీఎఫ్ పెన్షన్ పొందుతున్న వారికి కూడా ఆసరా పెన్షన్ ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన కార్మిక సంఘ నాయకులు త్వరలో కేంద్ర, రాష్ట్ర మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండం రాజ్ రామచందర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆశ వందార్ వేణు మాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేఆర్‌సీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం బాబురావు, మాజీ డైరెక్టర్ జేవీ దత్తాత్రేయులు, నర్సింగ్‌రావు, జీ కనకయ్య, పూర్ణప్రకాష్, సాయిరాం గౌడ్, వెంకటరమణ, మాధవరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, మోట పలుకుల రమేష్ పాల్గొన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలి


మందమర్రిటౌన్, జూన్ 17: ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దే శించిన ఉత్పత్తి లక్ష్యాల పెంపుదలకు కార్మికులు, అధికారులు కృషి చేయాలని మందమర్రి జీఎం మనోహర్ తెలి పారు. సోమవారం ఏరియాలోని కేకే ఓసీపీని ఆయన సందర్శించారు. ఉత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిరోజు ఉద్యోగులు అధికారులు తేడా లేకుండా రక్షణ సూత్రాలు పాటిస్తూ పనులను చేయాలన్నారు. అంతకుముందు ఓసీపీ ప్లాన్‌లను పరిశీలించారు. రోజువారి ఉత్పత్తి లక్ష్యాలను ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కేకే ఓసీపీని పరిశీలిస్తున్న జీఎం మనోహర్

ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లు పరిశీలన


స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని, జూన్ 17: ఆర్‌జీ-1 అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 18 నుంచి 20వరకు మూడు రోజులు నిర్వహించడం కోసం స్థానిక జవహర్ లాల్ నెహ్రూ క్రీడా ప్రాంగణం చేస్తున్న ఏర్పాట్లను సోమవారం ఎస్ఓటూ జీఎం రాంమోహన్, అధికారుల బృందం పరిశీలించింది. ఉదయం నుండి సాయంత్రం వరకు జరుగు ప్రాక్టికల్ పరీక్షలలో అభ్యర్థులకు త్రాగునీరు, షామియానా, వెహికల్ ట్రాక్ ఏర్పాటు చేసి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్(కార్పొరేట్) ప్రకాష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, హన్మంతరావు, అధికారులు, జితేందర్ సింగ్, దుర్గ ప్రసాద్, ఇక్బాల్ షరీఫ్ పాల్గొన్నారు.



రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూన్ 17: రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల ఉత్పత్తి లక్ష్యాలపై చర్చించారు. నిర్దేశిత లక్ష్యాల సాధనలో ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణ, బొగ్గును వెలికితీసేందుకు ప్రణాళిక రూపొందించుకొని అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. సమష్టి కృషితోనే లక్ష్యాలను చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షాకాలానికి అనుగుణంగా ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, రఘుపతి, రాధాకృష్ణ, రమేష్, రాజేందర్, వెంకటరమణ, కర్ణ, పద్మరాజు, రవీందర్‌రెడ్డి, కాశీ విశ్వేశ్వర్‌రావు, శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావు

శ్రీరాంపూర్, జూన్ 17: సింగరేణి తవ్వకాలు జరిపిన బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె న్యూటెక్, ఇందారం1ఎ గనుల కార్మికులు ఆయనను హైదరాబాద్‌లో కలిసి పలు సమస్యలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ, పలు ప్రసారమాధ్యమాల ద్వారా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేస్తారని తెలుస్తోం దని, దీనివల్ల కొన్ని కోట్ల రూపాయలు పెట్టి తవ్వకాలు చేపట్టిన సింగరేణి నష్టపోయి ప్రైవేటు వ్యక్తులు లాభపడతారన్నారు. సింగరేణి మనుగడకే ప్రమాదం ఏర్పడి కార్మికులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కిషన్‌రెడ్డి సింగరేణిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బొగ్గు బ్లాకులను టెండర్ లేకుండా నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.